క్లుప్తంగా

అంతర్వేదిలో మాజీ మంత్రి ఆర్కే రోజా



శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మాజీ మంత్రి ఆర్కే రోజా

నగరి: కోనసీమ జిల్లా పాలకొల్లు నియోజకవర్గం అంతర్వేదిలో వెలసిన నవ నరసింహస్వామి ఆలయాల్లో ఒకటైన శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, శాసనమండలి సభ్యురాలు వరుదు కళ్యాణి, కాపూరు శ్రీనివాస్‌తో కలసి మాజీ మంత్రి ఆర్కే రోజా దర్శించుకున్నారు. బుధవారం ఆలయానికి వెళ్లిన ఆమెకు ఆలయ అర్చకులు పాలకవర్గ సభ్యులు ఆలయం మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారి ప్రసాదాలను అందజేశారు. వేదమంత్రాలతో అర్చకులు ఆశీర్వదించి స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

మాజీ ఉప ముఖ్యమంత్రిని విమర్శిస్తే ఊరుకోం



కృపాలక్ష్మి

కార్వేటినగరం: మాజీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిపై అనవసరమైన విమర్శలు గుప్పిస్తే ఊరుకునేది లేదని వైఎస్ఆర్ సీపీ జీడీనెల్లూరు నియోజకవర్గం సమన్వయ కర్త కృపాలక్ష్మి అన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ నీతికి, నిజాయితీకి నిలువుటద్దంగా ఉంటున్న రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామిపై సమావేశాల్లో ఎమ్మెల్యే వీఎం థామస్ అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల కోసమే తన తండ్రి రాజకీయాల్లోకి వచ్చారని, జన సంక్షేమమే ఆయన లక్ష్యమన్నారు. అలాంటి వ్యక్తిని ఏకవచనంతో తీవ్ర దుర్భాషలాడడాన్ని తీవ్రంగా ఖండించారు. ఎమ్మెల్యే స్థాయిలో ఉంటూ ఎదుటి వ్యక్తిపై చౌకబారు మాటలు మాట్లాడడం మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. ఎమ్మెల్యే థామస్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమన్నారు.

నిస్సహాయ వ్యక్తి ఆస్పత్రికి తరలింపు

సాక్షి ఎఫెక్ట్..

నగరి: పట్టణపరిధిలోని కొండమిట్ట సచివాలయం సమీపం నాలుగు రోజులుగా ఒక గుర్తు తెలియని వ్యక్తి నీరు, ఆహారం లేకుండా నిర్జీవ స్థితిలో పడి ఉండడాన్ని వెలుగులోకి తెస్తూ సాక్షి దినపత్రికలో బుధవారం ప్రచురితమైన 'సచివాలయం పక్కనే జీవశ్చవంలా' అనే వార్తకు పోలీసులు స్పందించారు. అనాథలా పడివున్న వ్యక్తిని ప్రైవేటు అంబులెన్స్‌లో నగరి ఆస్పత్రికి తరలించారు. అనంతరం తిరుపతి రుయాకు తరలించారు.

సాఫ్ట్‌బాల్‌లో విద్యార్థుల ప్రతిభ



వెదురుకుప్పం: రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో వెదురుకుప్పం విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు హెచ్‌ఎం శ్రీనివాసులు, పీడీ రమేష్ తెలిపారు. జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థినులు చంద్రిక, పూజ, మౌనిక, కిరణ్మయి, అంజలి, ప్రియదర్శిని, తస్మిని, గౌతమి రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో అద్భుతమైన ప్రతిభ చూపినట్లు పేర్కొన్నారు. బుధవారం అభినందన సభ నిర్వహించి, విద్యార్థులను ప్రశంసించారు.

విద్యుత్ ఏఈగా రియాజ్ అహ్మద్

వెదురుకుప్పం: విద్యుత్ శాఖ వెదురుకుప్పం మండల ఏఈగా రియాజ్ అహ్మద్ బుధవారం పదవీ బాధ్యతలు తీసుకున్నారు. ఏఈని విద్యుత్ శాఖ సిబ్బంది సత్కరించారు.

ఆడుతూ పాడుతూ గడపాల్సిన బాల్యం పుస్తకాల మోతతో బరువెక్కుతోంది. ఏటా పైతరగతికి వెళ్తుంటే.. పుస్తకాల సంఖ్య కూడా దానికి తగ్గట్టుగానే పెరుగుతోంది. ప్రైవేటు స్కూళ్లలో అయితే పుస్తకాలను మోస్తూ సతమతమవుతున్నారు. బ్యాగు నిండా పుస్తకాలతో రెండు మూడు అంతస్తుల మెట్లు ఎక్కేందుకు అవస్థలు పడుతున్నారు.

– కార్వేటినగరం

అధిక పుస్తకాల బరువును మోసుకెళ్తున్న విద్యార్థులు





బాల్యంపై భారం

- తక్కువ తరగతుల్లోనే పుస్తకాల మోత
- చిన్నతనంలోనే బరువుతో ఆరోగ్య సమస్యలు
- చిన్నారుల ఆరోగ్యంపై వైద్యుల సూచనలు

నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులు స్కూలు బ్యాగులు మోయకూడదు. మిగిలిన తరగతులకు సంబంధించి విద్యార్థి శరీర బరువులో పదో వంతు ఉండాలని చిల్డ్రన్ స్కూల్ బ్యాగ్ యాక్ట్–2006 చెబుతోంది. ప్రతి పాఠశాలలో ఆ పాఠశాల యాజమాన్యాలు విద్యార్థుల పుస్తకాలకు లాకర్లు ఏర్పాటు చేయాలి. ఏ రోజు పుస్తకాలు ఆ రోజు ఇవ్వాలని తల్లిదండ్రులకు మార్గదర్శకాలు ఇవ్వాలి. ఇలాంటి సౌకర్యాలు కల్పించకపోయినా, నిబంధనలు పాటించక పోయినా పాఠశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలు విధిగా ప్రభుత్వం ముద్రించిన పాఠ్య పుస్తకాలతోనే విద్యార్థులకు పాఠాలు బోధించాలి. స్టేట్, సీబీఎస్ఈ సిలబస్ మినహా మరే ఇతర పాఠ్యాంశాలను బోధించరాదని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. అయితే ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఐఐటీ కోచింగ్, స్మార్ట్‌క్లాస్‌ల పేరుతో ప్రైవేటు ముద్రణ సంస్థల నుంచి పుస్తకాలను కొనుగోలు చేయాలని తల్లిదండ్రులకు సూచిస్తున్నారు.

42 వేల మంది విద్యాభ్యాసం

జీడీనెల్లూరు నియోజకవర్గంలో శ్రీరంగరాజపురం, వెదురుకుప్పం, కార్వేటినగరం, పాలసముద్రం, గంగాధరనెల్లూరు మండలాల్లో సుమారు 42 వేల మంది ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు 298 ఉన్నాయి. వీటిలో దాదాపు 39 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆరు సబ్జెక్టులకు ఆరు పాఠ్య పుస్తకాలు, మరో ఆరు నోట్ బుక్స్, కాపీ రైట్‌కు సంబంధించి నాలుగు పుస్తకాలు ఉంటాయి. ప్రైవేటు పాఠశాలలు మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయి. తల్లిదండ్రులపై ఫీజులు, విద్యార్థులపై పుస్తకాల భారం మోపుతున్నాయి. ఒకటో తరగతి చదే విద్యార్థికి సాధారణంగా 12 నుంచి 14 పుస్తకాలు ఉండాలి. కానీ 32 నుంచి 34 పుస్తకాలు ఉంటున్నాయి. ప్రింటెడ్ కాపీరైట్ ప్రింటెడ్ కలర్ కంపోజింగ్ , హోం, స్కూల్ ఎక్సర్ సైజ్ రైటింగ్, ఇంప్రూవ్‌మెంట్ లాంగ్వేజ్, డిక్షనరీ, డ్రాయింగ్ తదితర పుస్తకాలు అదనంగా జోడిస్తున్నారు. అనవసరమైన పుస్తకాలు మోస్తున్న చిన్నారుల వెన్నెముకపై తీవ్ర ప్రభావం పడి ఎదుగుదల లోపించే ప్రమాదం ఉంది.

వైద్యనిపుణుల సూచనలు

- పిల్లల్లో సాధారణంగా 15 ఏళ్లలోపే శరీరంలో వివిధ మార్పులు చోటు చేసుకుంటాయి. పాఠశాల వయసులో మోయాల్సిన భారం కంటే అధిక బరువు మోయడంతో వెన్నెముక సమస్యలు తలెత్తుతాయి.
- ఎక్కువ పుస్తకాలున్న పక్షంలో ఉపాధ్యాయుల సలహాల మేరకు ఏ రోజు అవసరమైన పుస్తకాలు ఆ రోజు తీసుకెళ్లేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి
- బ్యాగును రెండు భుజాలపై సమాన బరువుతో తగిలించుకోవాలి. ఒక వైపు తగిలించుకుంటే భుజం, మెడ నొప్పి వస్తుంది.
- నిత్యం వ్యాయామం చేయడంతో శారీరక పరమైన ఇబ్బందులు అధిగమించవచ్చు
- విద్యార్థి బరువులో పుస్తకాల బరువు మూడోవంతు మించరాదు. ఉదాహరణకు 20 కిలోల బరువు ఉన్న విద్యార్థి మూడు కిలోల పుస్తకాలు మాత్రమే మోయాలి.

పుస్తకాల బరువు తగ్గించాలి



చదువు విద్యార్థిలో చైతన్యం తీసుకురావాలి. విజ్ఞానంపై వారిలో ఆసక్తిని పెంచాలి. కానీ నేటి చదువులకు తీసుకెళ్లే పుస్తకాలు విద్యార్థులకు భారంగా మారుతున్నాయని ఎన్నో అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. దీనిపై తల్లిదండ్రులు, విద్యాసంస్థల యాజమాన్యాలు, ప్రభుత్వాలు కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. పుస్తకాల బరువు కారణంగా చిన్నతనంలోనే మానసిక బలహీనత బారిన పడే ప్రమాదం ఉంది. ఈ బరువులు ఇలానే మోస్తే భవిష్యత్‌లో వారి వెన్నుపూస, నడుము, కండరాలు నొప్పులు బాధిస్తాయి. విద్యార్థి ఆనందంగా, ఆరోగ్యంగా విద్యాభ్యాసం చేయాలంటే వారు మోసుకెళ్లే పుస్తకాల బ్యాగు బరువు తగ్గించాల్సి ఉంది.

– డాక్టర్ హేమశ్రీ, వైద్యాధికారి, కత్తెరపల్లి, కార్వేటినగరం మండలం

కష్టపడితేనే విజయం



సమావేశంలో పాల్గొన్న వివిధ కంపెనీల ప్రతినిధులు

విజయపురం: కష్టపడి పనిచేసేవారు ఏదైనా సాధించగలరని డిక్సన్ టెక్నాలజీ ప్రైవేట్ ఇండియా లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ లక్ష్మీపతి అన్నారు. బుధవారం విజయపురం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో స్థానిక ప్రిన్సిపల్ భైరవుడు అధ్యక్షతన పలువురు పారిశ్రామిక క్యాంపెయిన్ విద్యార్థులకు విద్యారంగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి చదువుతోపాటు కష్టపడి రాణించే విధానంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పని చేయడానికి విద్యార్థులు సంసిద్ధంగా ఉండాలన్నారు. అమరరాజా కంపెనీ సీనియర్ మేనేజర్ వెంకట రమణ కుమార్ మాట్లాడుతూ విద్యార్థికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందజేసి, వారిలో నైపుణ్యం పెంపొందించాలన్నారు. ప్రగతి పవర్ సొల్యూషన్స్ అధినేత జిల్లేడు బాలాజీకిరణ్ మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు బానిస కాకుండా ఉన్నతమైన ఆశయాలతో తమ జీవన విధానాలను మెరుగుపరుచుకోవాలన్నారు.

సిద్ధమవుతున్న మునేశ్వర ఆలయం

నగరి: పట్టణ పరిధి బస్టాండు సమీపంలో మునేశ్వర స్వామి ఆలయాన్ని స్థానిక దాతలు ఆధునికీకరిస్తున్నారు. కొన్ని నెలల పాటుగా నవీకరణ పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆలయ ప్రహరీ, ఆర్చి, పీఠం, విశ్రాంతి గదులు, హాలు సిద్ధం చేసిన దాతలు ప్రస్తుతం ఆలయానికి వెళ్లే రోడ్డు పనులను కూడా ముగించారు.

వడమాలపేట పాఠశాలకు స్వచ్ఛతా అవార్డు



కలెక్టర్ నుంచి అవార్డు అందుకొంటున్న హెచ్‌ఎం



పాఠశాలలో విద్యార్థుల సంబరాలు

వడమాలపేట(పుత్తూరు): తిరుపతి జిల్లా స్థాయిలో వడమాలపేట జెడ్పీ ఉన్నత పాఠశాల స్వచ్ఛ ఆంధ్ర అవార్డును కైవసం చేసుకొంది. ఈ మేరకు జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా పాఠశాల హెచ్‌ఎం కరుణా నవనీతం అవార్డును అందుకొన్నారు. పురస్కారం అందుకొన్న నేపథ్యంలో బుధవారం పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు సంబరాలు చేసుకొన్నారు. హెచ్‌ఎం నవనీతం మాట్లాడుతూ జిల్లాలో 5 పాఠశాలలను ఎంపిక చేయాల్సి ఉండగా అందులో వడమాలపేట స్థానం సంపాదించడం సంతోషకరమన్నారు. దీంతో పాఠశాలపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. అవార్డు రావడానికి కృషి చేసిన విద్యార్థులు, ఉపాధ్యాయ బృందాన్ని ఆమె అభినందించారు.

క్రీడల్లో పన్నూరు విద్యార్థుల ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

విజయపురం: మండల స్థాయి క్రీడా పోటీల్లో పన్నూరు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. గంగమాంబపురం ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం మండలస్థాయి అండర్–14, 17 క్రీడా పోటీలు నిర్వహించారు. బాలురు, బాలికల విభాగంలో జరిగిన కబడ్డీ, ఖోఖో పోటీలో పన్నూరు పాఠశాల విద్యార్థులు విన్నర్‌గా నిలించారు. అలాగే అండర్–14 లాంగ్ జంప్‌లో వనీషా, అండర్–17లో అలిషా, ధనుష్ ప్రథమ స్థానం సాధించారు. అలాగే ఓవరాల్ చాంపియన్ షిప్ ట్రోఫీని పన్నూరు పాఠశాల విద్యార్థులు కైవసం చేసుకొన్నారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయిని అనితతో పాటు, క్రీడల్లో విజేతగా నిలిచిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు జానికిరామిరెడ్డితోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

చెరువును తలపిస్తున్న వారపు సంత



ప్రధాన రహదారిపై నీళ్లు చేరడంతో కుంటను తలపిస్తున్న వారపు సంత

వెదురుకుప్పం: వారపు సంత చెరువును తలపిస్తోంది. బుధవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి వెదురుకుప్పం మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన వాణిజ్య సముదాయం ఎదురుగా ప్రధాన రహదారిపై వర్షపు నీళ్లు నిలిచిపోయాయి. వృథా నీరు వెళ్లేందుకు కాలువలు లేకపోవడంతో రోడ్డుపైనే నిల్వ ఉండడంతో చెరువును తలపించింది. దీంతో వాహనదారులు అసౌకర్యానికి గురయ్యారు. వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు. వర్షాలు ఎప్పుడు కురిసినా కుంటలను తలపిస్తుండడంతో స్థానికుల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది.

రుచికరమైన భోజనం అందించాలి



మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న ఎంఈఓ గిరిజ

పాలసముద్రం: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని రుచికరంగా చేయాలని ఎంఈఓ గిరిజ తెలిపారు. బుధవారం పాలసముద్రం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని ఆమె పరిశీలించారు. విద్యార్థులతో కలసి భోజనం చేశారు. మధ్యాహ్నం భోజనం మెనూపై ఆరా తీశారు. రుచికరమైన నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. ముఖ్యంగా మధ్యాహ్న భోజనం చేస్తున్న పాత్రలను సబ్బుతో శుభ్రం చేసిన తరువాతనే భోజనం చేయాలని హెచ్చరించారు. అనంతరం విద్యార్థులకు చేసిన భోజనాన్ని వారితో కలసి భోజనం చేశారు. కార్యక్రమంలో సీఆర్పీ శరవణన్, ఉపాధ్యాయులు ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

తూకాల్లో తేడాలొస్తే చర్యలు తప్పవు



తిరుమలరాజుపురం రేషన్ షాపులో స్టాక్ పరిశీలన

పాలసముద్రం: మండలంలో తెల్లరేషన్ కార్డులకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న నిత్యావసర సరుకుల తూకాల్లో తేడాలొస్తే సంబంధిత డీలరుపై చర్యలు తప్పదని డిప్యూటీ తహశీల్దార్ రిషివర్మ, ఏఆర్‌ఐ దేవి తెలిపారు. బుధవారం తిరుమలరాజుపురం, నరసింహపురం, గంగమాంబపురం పంచాయతీల్లోని చౌకదుకాణాలను వారు క్షేత్రస్థాయిల్లో పరిశీలించారు. డీలర్లతో వారు మాట్లాడుతూ చౌక దుకాణం ఎదుట తప్పకుండా నిత్యావసర ధరల పట్టిక బోర్డు, తాగునీటి సౌకర్యం తప్పక ఉండాలని హెచ్చరించారు. దివ్యాంగులు, వృద్ధులకు ఇంటివద్దకే రేషన్ సరుకులు అందించాల్సిన బాధ్యత కూడా డీలర్లపై ఉందన్నారు. ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు డీలర్లు రేషన్ షాపులో ఉండాలని తెలిపారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు



చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

పాలసముద్రం: చిన్నారులకు తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయాలని సీహెచ్‌ఓ సుబ్రమణ్యం తెలిపారు. బుధవారం శ్రీకావేరిరాజుపురం, పాలసముద్రం, మిద్దినత్తం గ్రామంలోని ఆరోగ్య ఉపకేంద్రాల్లో గర్భిణీలకు, బాలింతలకు ఉచిత వైద్య పరీక్షలు చేసి, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు చేశారు. శ్రీకావేరిరాజుపురం ఆరోగ్య ఉపకేంద్రంలో వైద్య పరీక్షలు వచ్చిన వారితో ఎంఎల్‌హెచ్‌ఓ సునీత మాట్లాడుతూ చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేయడంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. క్రమం తప్పకుండా టీకాలు వేయించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీపై శ్రద్ధ పెట్టాలి



ఎరువుని పరిశీలిస్తున్న ఎంపీడీఓ సతీష్

పాలసముద్రం: గ్రామాల్లో పారిశుధ్యం సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, చెత్త నుంచి సంపద తయారీపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎంపీడీఓ సతీష్‌కుమార్ తెలిపారు. బుధవారం శ్రీకావేరిరాజుపురం గ్రామ సచివాలయం పరిధిలోని చెత్త సేకరణ కేంద్రాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ చెత్త సేకరణతో గ్రామాల్లో పారిశుధ్య సమస్య తీరడంతో పాటు చెత్త నుంచి సంపద తయారు చేస్తే పంచాయతీకి ఆదాయం వస్తుందని పేర్కొన్నారు. గ్రీన్ అంబాసిడర్ల ద్వారా ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రాలను అభివృద్ధి చేయాలన్నారు. తయారైన ఎరువును రైతులకు తక్కువ ధరకు కేజీల ప్రకారం విక్రయించాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గాలి మహేష్, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

ఉత్తరం.. సుమధుర జ్ఞాపకం

- కనుమరుగైన కబుర్ల లేఖలు
- స్మార్ట్‌ఫోన్‌ల రాకతో ఉనికి కోల్పోయిన జాబులు
- బంధుమిత్రులకు ఉత్తరాలు రాసే ఊసే లేదు
- నేడు ప్రపంచ పోస్టల్ దినోత్సవం



పోస్టాఫీసు



ఇన్‌లాండ్ లెటర్, పోస్టు కార్డు

నగరి: ఉత్తరం ఒక మధురమైన జ్ఞాపకాలకు సాధనం. ఉత్తరాలు మన ఆత్మీయుల యోగక్షేమాలకు ఆనవాలు. ప్రేమికుల్లో విరబూసిన పారిజాతాలు.. సరిహద్దులో శత్రువులతో పగలురాత్రి పోరాడుతున్న సైనికుడు తన భార్య పంపే హృదయ నివేదనల కోసం ఎదురు చూసేందుకు ఎన్నో పడిగాపులు.. ఇలా మానవ సంబంధాలకు నిలయంగా మారిన ఉత్తరాలు ఇప్పుడు కనుమరు గయ్యాయి. సెల్‌ఫోన్లు, ఎస్‌ఎంఎస్‌లు, వాట్సప్‌లు, ఈ–మెయిల్ తదితర అధునాతన టెక్నాలజీ అందుబాటులోకి రావడంతో కనిపించకుండా పోయాయి.

వారంలో ఒకసారైన లేఖలు

గతంలో బంధువులు, మిత్రులు, ఆప్తులు, తమ వారితో కష్ట సుఖాలను పంచుకునేందుకు మనసారా లేఖల ద్వారా వారంలో ఒకసారైనా సమాచారం చేర వేసుకునే వారు. కనీసం 15 రోజులలో ఆత్మీయులు, ఆప్తులతో ఉత్తరం రాకపోతే పోస్టాఫీసుకు వెళ్లి ఉత్తరం రాసి పోస్టుబాక్సులో వేసే వారు. ఆ ఉత్తరాలు మధురానుభూతులు, తీపి జ్ఞాపకాలు నేడు కనుమరుగయ్యాయి. స్మార్ట్‌ఫోన్లు, ఈ–మెయిల్‌తో ఇవి ప్రస్తుతం కనిపించకుండా పోయాయి.

కలం స్నేహానికి చాలా క్రేజ్

ఎవరు ఎక్కడ ఉంటారో తెలియదు. వారపత్రికలు, మాస పత్రికల ద్వారా పరిచయం అయ్యేవారు. ఆ తరువాత కలం స్నేహంపై ఆసక్తి ఉన్నవారు వారి చిరునామా పత్రికల్లో ప్రచురించేవారు. అభిరుచి ఉన్న వారు ఉత్తరాలు అందుకునేవారు. అలా కలం స్నేహం అంటే ఒకప్పుడు బాగా క్రేజ్ ఉండేది. పేజీలకు పేజీలు ఉత్తరాలు రాసుకునే వారు..

ఇదంతా గతం

ఉత్తరాలతోనే యోగక్షేమాలు

ఇప్పుడు సెల్‌ఫోన్లు వచ్చాయి. వాట్సాప్ మెసేజ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఒకప్పుడు ఇలా కాదు. పైచదువుల కోసం, ఉద్యోగం దూర ప్రాంతాలకు వెళ్లే పిల్లలు, యువకులు ఉత్తరాలు రాస్తే తప్పా యోగక్షేమాలు తెలిసేవి కాదు. అలాగే తల్లిదండ్రులు తమ సమాచారాన్ని పిల్లలకు తెలియజేయాలంటే ఉత్తరమే వారధిగా ఉండేది. పూజ్యులైన అమ్మానాన్నల పాదపద్మాలకు నమస్కరించి అంటూ... దూర ప్రాంతాల నుంచి కొడుకు, అత్తారింటి నుంచి కూతురు రాసే ఉత్తరాలు చూసుకుని తల్లిదండ్రులు పులకించి పోయేవారు. ఇలా మానవ సంబంధాలకు వారధిగా ఉండే ఉత్తరాలు నేడు సాంకేతికాభివృద్ధి మాటున కనుమరుగయ్యాయి. వాటి స్థానంలో అధునిక సమాచార మాధ్యమాలు అల్లుకున్నాయి. ఒకప్పటి ఉత్తరం ఇప్పుడు కొత్త హంగులు సంతరించుకుంది. ఒకప్పుడు బంధాలకు ఆప్యాయతలు పంచిన లేఖలు ఇప్పుడు కార్పొరేట్ సంస్థలకు వినియోగదారుల మధ్య వారధిగా సరికొత్త అవతారం ఎత్తాయి. సెల్‌ఫోన్లు, ఈ–మెయిల్, ఇంటర్నెట్, టెలిఫోన్లు, చాటింగ్ తదితర సేవలు విస్తరించాయి. పోస్టుకార్డుల స్థానంలో ఈ–పోస్టు, స్పీడ్ పోస్టులు అందుబాటులోకి వచ్చాయి. ఎక్స్‌ప్రెస్ పార్సిల్, ఎలక్ట్రానిక్ మిషన్ ఉత్తరాలు, బిజినెస్ పోస్టు, పేమెంట్ బ్యాంకులుగా పోస్టాఫీసులు పలు సేవలు అందిస్తున్నాయి.

ప్రధాన సమాచార వారధి

నగరిలో గత 10 దశాబ్దాల నుంచి పోస్టాఫీసు ఉంది. ఇప్పటికి ఇది ప్రధాన కార్యాలయంగా సేవలు అందిస్తుంది. గతంలో ప్రతిరోజూ వేలాది ఉత్తరాలు ఇక్కడ నుంచి ప్రజలకు చేరవేసే వారు. టెక్నాలజీ కాలంలో ఉత్తరం బందీగా మారిపోయింది. ఆత్మీయులు రాసే ఉత్తరాల స్థానంలో ప్రపంచాన్ని గుప్పెట్లో పెట్టుకున్న సెల్‌ఫోన్ రాజ్యమేలుతోంది. ఇది మానవ సంబంధాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందో అర్థం కాని పరిస్థితి అని పలువురు వృద్ధులు, సీనియర్ సిటిజన్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉత్తరాల కోసం ఎదురుచూపులు

మనలోని భావాల్ని, ఎదుటివారికి నేరుగా చెప్పలేని విషయాలు ఉత్తరాల ద్వారా చక్కగా వివరించవచ్చు. ఉత్తరం ఓ మధుర జ్ఞాపకం. తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు ఇలా ఎవరికి ఉత్తరం రాసినా అదొక తీపి గుర్తు, లేఖలు భాషపై పట్టు పెంచుతాయి. ఈ విషయాన్ని నేటితరం యువత గుర్తించాలి.

– లింగరాజు, పాపరాజు కండ్రిగ, నిండ్ర మండలం

ఆ ఆనందం వర్ణనాతీతం

ఉత్తరం కోసం గ్రామంలో ఎదురుచూసే మధురానుభూతులు వర్ణించలేనివి. ఉత్తరాల కోసం ఎదురుచూసే తల్లి, తండ్రి, కూతుళ్లు, కోడళ్లు, కొడుకులు ఇలా పోస్ట్‌మెన్ సైకిల్ బెల్ వినగానే ఆతృతగా పరుగులు తీస్తూ వచ్చేవారు. పోస్ట్ అంటూ పోస్టుమెన్ అనగానే వారి కళ్లలోని ఆనందం వర్ణనాతీతం. మనియార్డర్ల కోసం వృద్ధులు ఎదురుచూసే వారు. నేడు ఆ ఎదురుచూపులు లేవు.

– కుమారస్వామి, రిటైర్డ్ పోస్టల్ ఉద్యోగి, నగరి

రోడ్డు నిబంధనలపై అవగాహన

పాలసముద్రం: రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా ప్రాణాలు కోల్పోతున్న ద్విచక్ర వాహనదారులకు రక్షణకు పోలీస్ శాఖ చర్యలు చేపట్టిందని ఎస్‌ఐ చిన్నరెడ్డప్ప తెలిపారు. బుధవారం చిత్తూరు ఎస్పీ ఉత్తర్వులు మేరకు బలిజకండ్రిగలో మోటార్ వాహన చట్టం నిబంధనలపై ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. ఎస్‌ఐ చిన్నరెడ్డప్ప మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ఉండాలి. కొత్త నిబంధనల ప్రకారం ద్విచక్ర వాహనంపై వెనుక కూర్చునే వ్యక్తికి కూడా హెల్మెట్ తప్పనిసరి. లేకుంటే రూ.1000 జరిమానా వేస్తారన్నారు. ఆటో డ్రైవర్లు రికార్డులు, యూనిఫాం తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ఇన్సూరెన్స్ పొల్యూషన్ సర్టిఫికెట్లు ఉండాలని సూచించారు.